క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో వైఎస్సార్ సీపీ అన్నదానం

మండపేట: వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి బోడే శ్రీకృష్ణ జన్మదినోత్సవం సందర్భంగా ఆ పార్టీ నాయకులు, శ్రీకృష్ణ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పట్టణంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దర్శనంచెరువు వెనుక గల మయూరి వృద్ధాశ్రమంలో శ్రీకృష్ణ యూత్ సభ్యులు అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజబాబు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆ పార్టీ నాయకులు పెంకే గంగాధర్, పంపన శ్రీనివాస్, పిల్లారం సత్యనారాయణ, దుగ్గిరాల రాంబాబులు గాంధీనగర్‌లోని ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ డొక్కా సీతమ్మ నిత్యాన్నదాన శిబిరంలో అనాథలకు అన్నదానం నిర్వహించి, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు రేగా వెంకన్న, నూరంపూడి సత్యప్రసాద్, పెంకే వెంకట్రావు, తాడి రామారావు, నిమ్మలపూడి వీరబాబు, శివకోటి శేష సుబ్రహ్మణ్యం, ముక్కా దాలయ్య, మునిని మోహన్, కుక్కల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు సత్యశాంతి ఎంపిక



రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థిని శాంతితో పాటు ఉపాధ్యాయులు

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని జిల్లి సత్యశాంతి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.గోపాలకృష్ణ తెలిపారు. ఈ నెల 3న నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి అండర్–17 స్కూల్ గేమ్స్ పోటీల్లో సత్యశాంతి హాకీ పోటీల్లో పాల్గొంటుందన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికవడంపై హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు జేవీఎన్ చిట్టి, ఎస్ఎంసీ చైర్మన్ వై.అనిల్, వీరబాబు, సర్పంచ్ పెమ్మాడి బేబీ సత్తిబాబు, గ్రామ పెద్దలు విద్యార్థిని అభినందించారు.

25 మందికి ఆర్థోపెడిక్ పరీక్షలు



అంగర పీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రాము

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీలోని బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ నూతన బ్లాక్‌లో శుక్రవారం ఆర్థోపెడిక్ వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి పీఎస్ఎస్ రత్నకుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ కె.రాము రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి మెరుగైన వైద్య పరీక్షలు చేసేందుకు కృషి చేస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జక్కుల మల్లికార్జునరావు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి శివ దీక్షలు

రామచంద్రపురం రూరల్: కార్తికమాసం పురస్కరించుకుని నేటి నుంచి ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం 5 గంటలకు శివ దీక్షలు ప్రారంభించనున్నట్టు రాజరాజేశ్వరి పీఠాధిపతి, మహాశివరాత్రి కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు శివశ్రీ తాళ్ల సాంబశివరావు గురుజీ శుక్రవారం విలేకరులకు తెలిపారు. భీమేశ్వరస్వామి పుట్టినరోజు మార్గశిర చతుర్దశి వరకు (40 రోజులు) దీక్షాకాలం కొనసాగుతుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

దీపావళి.. ఆనందకేళి

కె.గంగవరం: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని ప్రజలు కోలాహలంగా జరుపుకొన్నారు. సాయంత్రం లక్ష్మీదేవిని పూజించుకుని దీపాలు వెలిగించారు. కొన్ని గృహాలు దీపాల అలంకరణ చేశారు. గ్రామాల్లోని ఆలయాలను విద్యుత్ దీపాల అలంకరణలతో కనువిందు చేశారు. అనంతరం పిల్లల నుంచి పెద్దల వరకు బాణసంచా కాల్చి పండుగను ఉత్సాహంగా జరుపుకొన్నారు.

గృహోపకరణాల చోరీ

ఆలమూరు: గ్రామంలోని ఇందిరాపేటలో గత నెల 30 అర్ధరాత్రి వెండి వస్తువులు, గృహోపకరణాల అపహరణ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం స్థానిక ఇందిరా పేట కాలనీలో అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు పెంకుటిల్లులోని తాళాలు పగులగొట్టి అందులో ఉన్న వస్తువులను అపహరించారు. సుమారు రూ.మూడు లక్షల విలువైన 65 అంగుళాల స్మార్ట్ ఎల్ఈడీ టీవీ, రెండు గ్యాస్ సిలిండర్లతో పాటు బీరువాను పగులగొట్టి అందులో ఉన్న విలువైన దుస్తులు, ఆరకిలో వెండి వస్తువులను దొంగిలించారు. అయితే ఆ ఇంటి యజమానులు జీవనోపాధి దృష్ట్యా కాకినాడలో ఉండటంతో ఈ చోరీ సంగతి ఆలస్యంగా తెలిసింది. దీనిపై బాధిత కుటుంబసభ్యులు చూపుల శ్రీనివాస్, పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.అశోక్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కంటికి మొక్కేందుకు..

- మండపేట నియోజకవర్గంలో పలు పవిత్ర ఆలయాలు
- నేటి నుంచి కార్తిక మాసం ఆరంభం
- క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లు పూర్తి

కపిలేశ్వరపురం: కార్తికంలో ముక్కంటిని పూజిస్తే కోరిన కోర్కెలు తీరతాయని నమ్మకం. అందుకే కార్తిక మాసంలో అధిక సంఖ్యలో భక్తులు శివాలయాలను సందర్శించి అభిషేకాలు చేస్తారు. పంచారామాల తర్వాత అంతటి ప్రాశస్త్యం గలవి అష్ట సోమేశ్వర ఆలయాలు. అందులో నాలుగు ఆలయాలు కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లిలో ఉండడంతో మండపేట నియోజకవర్గానికి ప్రాధాన్యం ఏర్పడింది. దీంతోపాటు మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో పేరెన్నికగన్న శివాలయాలు ఎన్నింటినో కార్తిక సందడికి సర్వ సన్నద్ధం చేశారు.

ముఖ్యమైన తేదీలు...

కార్తికంలో భక్తులు తెల్లవారుజామునే పుణ్యస్నానమాచరించి దేవతామూర్తుల ఆలయాలను సందర్శిస్తారు. నేటి నుంచి కార్తికం ప్రారంభం కానుండగా 4న తొలి సోమవారం, 5న నాగుల చవితి, 3న భగిని హస్త భోజన కార్యక్రమం, 11న రెండో సోమవారం, 15న జ్వాలాతోరణం, 18న మూడో సోమవారం, 25న నాలుగో సోమవారం, 29న మాస శివరాత్రి, డిసెంబర్ 2న పోలిస్వర్గం కార్యక్రమంతో కార్తికం ముగియనుంది. కార్తిక మాసంలోని ఆదివారాల్లో వన భోజనాలు, ఆలయాల దర్శన కార్యక్రమాలు జరుపుకోవడం ఆనవాయితీ.



కోరుమిల్లి అష్ట సోమేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న అర్చకుడు

పవిత్ర ప్రదేశాలివీ..

మండపేట అర్బన్‌లోని అగస్త్యేశ్వరస్వామి, సీతారామక్షేత్రం, అయ్యప్పస్వామి, శివాలయం, ద్వారపూడి అయ్యప్పస్వామి, ఏడిద సంఘ మేశ్వరాలయం, కేశవరంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, రాయవరం మండలం సోమేశ్వరంలోని బాల త్రిపుర సుందరీదేవి సమేత సోమేశ్వరస్వామి, చెల్లూరులోని అగస్త్యేశ్వరస్వామి, వెంటూరులో ఉమా సమేత సోమేశ్వరస్వామి, వెదురుపాక రాయవరం, మాచవరం, పసలపూడి, గ్రామాల్లోని శివాలయాల్లో కార్తిక పూజలు చేస్తారు. కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లిలోని నాలుగో అష్ట సోమేశ్వరాలయమైన రాజరాజేశ్వరీదేవీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం, కపిలేశ్వరపురంలోని అగస్త్యేశ్వర,

కార్తికం ప్రాధాన్యతను కాపాడుకుందాం



కార్తిక మాసం అత్యంత పవిత్రమైనది. పురాణ ఇతిహాసాల్లో కార్తికం ప్రస్తావన ఉంది. ఆధునిక కాలంలో పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో అక్కడక్కడ వింత పోకడలు పొడ చూపుతున్నాయి. అత్యంత భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు చేయడం పరమ పవిత్రమన్న విషయాన్ని అందరూ గుర్తించాలి.

– మూర్తి, వేద పండితుడు, పామర్రు, కె.గంగవరం మండలం

పాపవినాశేశ్వర, అంగరలోని సుబ్రహ్మణ్యేశ్వర, పడమర ఖండ్రికలోని ఖణ్ణలింగేశ్వరస్వామి, త్రయంబకేశ్వరస్వామి, తాతపూడిలోని మల్లేశ్వరస్వామి ఆలయాల్లో కార్తిక పూజలు ఘనంగా నిర్వహిస్తారు.

స్నానాల రేవులివీ...

మండపేట పట్టణం, రూరల్ గ్రామాల్లో పెద్దకాలువ రేవులు, మెహర్ ఆశ్రమం, పాలతోడు శివాలయం వద్ద రేవు, వెంగతోడు–తాపేశ్వరం రహదారిలోని దొర రేవు, మడపాడు దుర్గాదేవి ద్వారపూడి అయ్యప్పస్వామి, ఆలయాల వద్ద, పేకేటిపాకలు రేవులలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. రాయవరం మండలం సోమేశ్వరం కాలువ రేవు, రాయవరం, వెదురుపాక గ్రామాల పరిధిలోని తుల్యభాగ నది రేవులు, పసలపూడి, నదురుబాద, వెంటూరు గ్రామాల్లోని కాలువ, కోరంగి,



సుందరమైన పడమర ఖండ్రికలోని త్రయంబకేశ్వరస్వామి ఆలయం

టేకి డ్రైన్ పరిధిలోని రేవుల్లో స్నానాలను ఆచరిస్తుంటారు. కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి, వాకతిప్ప గ్రామాల్లో గౌతమి నది పుష్కర ఘాట్‌లు, వెదురుమూడి, నల్లూరు, కాలేరు, అచ్యుతాపురం గ్రామాల భక్తులు కోరంగి కెనాల్ రేవుల్లోనూ, అంగర, పడమర ఖండ్రి, టేకి, మాచర గ్రామాల ప్రజలు టేకి డ్రైన్ రేవుల్లోనూ స్నానమాచరిస్తుంటారు. రేవుల వద్ద తగిన ఏర్పాట్లను పూర్తి చేశారు.

దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

మండపేట: పట్టణంలో దీపం–2 పథకాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శుక్రవారం పట్టణంలో ప్రారంభించారు. స్థానిక పాటిమీద ఉన్న హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దీపం పథకం కింద మంజూరైన ఉచిత గ్యాస్ సిలిండర్లను ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ఏడాదికి మూడు సిలిండర్ల చొప్పున నాలుగు నెలలకోసారి ఉచిత గ్యాస్ సిలిండర్లను ప్రజలకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ అఖిల, జనసేన, బీజేపీల మండపేట ఇన్‌చార్జులు వేగుళ్ల లీలాకృష్ణ, కోటిపల్లి సాయిరామ్, గ్యాస్ ఏజెన్సీ అధినేత చిక్కిన చిన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, ఎమ్మార్వో తేజేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దారు మెహెర్ బాబా పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

పలు రకాల అనారోగ్యాలతో వివిధ ఆసుపత్రులలో చికిత్స చేయించుకుని సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న పలువురు శుక్రవారం సహాయనిధి చెక్కులను అందుకున్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు లబ్ధిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం రూ 2.22 లక్షలు మంజూరు కాగా వాటిలో పట్టణానికి చెందిన పడాల రేవతికి రూ. 30 వేల 786, చిటికెరెడ్డి అనూషకు రూ.30 వేల 920, ఇల్ల గంగావతి రూ.71 వేల 270లు అదేవిధంగా రాయవరానికి చెందిన పడాల వీరలక్ష్మికి రూ 49 వేల 257లు, పసలపూడికి చెందిన పసలపూడి సాయిబాలారెడ్డికి రూ 40 వేల చెక్కులను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మద్యం షాపు వద్దంటూ స్థానికుల ధర్నా



మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ ధర్నా చేస్తున్న గొల్లపుంత ప్రజలు

- మరునాడు ప్రారంభించిన వ్యాపారి

మండపేట: జనావాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటుకు చేస్తున్న సన్నాహాలను స్థానికులు అడ్డుకున్నారు. స్థానిక గొల్లపుంత రోడ్డులోని ఓ భవనంలో గురువారం మద్యం షాపు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. దానిని వ్యతిరేకిస్తూ అక్కడి వారు గురువారం రోడ్డుపై ధర్నా చేశారు. జనావాస ప్రాంతాల్లోకి మద్యం విక్రయాలను వ్యతిరేకిస్తూ వారు నినాదాలు చేశారు. మద్యం దుకాణం ఎదురుగా బింట్లు చేసి, వారు నిరసన తెలిపారు. రాత్రి వేళల్లో గొల్లపుంత రోడ్డులో ప్రయాణించేందుకే తాము భయపడుతున్నామని ఇక్కడ మద్యం దుకాణం కూడా వెలిస్తే ప్రమాదాలు, వివాదాలు ఎక్కువ అవుతాయని అభ్యంతరం తెలిపారు. స్థానికుల నిరసనకు టీడీపీ నాయకుడు వాదా ప్రసాదరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో విజ్జన రాంబాబు, విద్యాసాగర్ విద్యాసంస్థల అధినేత వర్రే సత్యనారాయణ, కంచరెట్టి మల్లేష్, గనిశెట్టి రామకృష్ణ, తీగిరెడ్డి రాము, నూని సత్తిబాబు, పుచ్చకాయల అబ్బు, గనిశెట్టి సత్తిరాజు, రెడ్డి చిన్న, కంకంరెట్టి గణేష్, విద్యా సాగర్, గంగుమళ్ల భీబ్బన్న, బిందులు శివ, మహిళలు పాల్గొన్నారు. కాగా స్థానికుల ఆందోళనతో దీపావళి నాడు మౌనం పాటించిన మద్యం దుకాణదారుడు శుక్రవారం ఉదయం యథావిధిగా షాపును ప్రారంభించారు. దీనిపై సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

రెవెన్యూ సభల ద్వారా భూ సమస్యల పరిష్కారం



సత్యవాడ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి



అద్దంకివారిలంక రెవెన్యూ గ్రామ సభలో అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

కె.గంగవరం: గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులను సద్వినియోగం చేసుకోవాలని తద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని సత్యవాడలో జరుగుతున్న గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో జరిగిన రీసర్వేలో రైతులకు ఎటువంటి సమస్యలు వచ్చిన ఈ గ్రామ సభల్లో రాతపూర్వకంగా ఫిర్యాదు అందిస్తే రెవెన్యూ అధికారులు సంబంధిత సమస్యను పరిష్కరిస్తారన్నారు. చాలా వరకు రీసర్వేలో భూ సమస్యలను పరిష్కారం అయ్యాయని ఇంకా గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ఈ రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. సర్పంచ్ తహసీల్దార్ మృత్యుంజయరావు, ఆర్‌వెంకట్రావు, సర్పంచ్ సలాది శ్రీను, సలాది రమేష్, అడపా నారాయణస్వామి ఇతర రెవెన్యూ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యాజమాన్య హక్కుల రక్షణకు గ్రామసభలు

కపిలేశ్వరపురం: భూ యాజమాన్య హక్కుల రక్షణే ధ్యేయంగా రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ చిన్నారావు అన్నారు. మండలంలోని కోరుమిల్లి, అద్దంకివారిలంక గ్రామాల్లో శుక్రవారం భూముల రీసర్వే గ్రామ సభలు నిర్వహించారు. ఆయా పంచాయతీల సర్పంచుల ఆధ్వర్యంలో ఆకుల సత్యనారాయణ, నాతి గవరయ్య అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభల్లో భూయాజమానుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ నిర్ణీతంచిన సమయంలోగా దరఖాస్తుల్లో పేర్కొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, భూ యజమానులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాధిత దళితులకు అండగా ఉంటాం

- పలువురు నాయకుల భరోసా
- పరామర్శించిన వారిలో మాజీ ఎంపీ హర్షకుమార్, ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: దీపావళి నాడు అగ్ర వర్ణాల వారి దాడిలో గాయపడిన పట్టణానికి చెందిన దళిత యువకులను పలువురు దళిత సంఘాల నాయకులు, పలు రాజకీయ పార్టీల నాయకులు పరామర్శించారు. స్థానిక ఏడిద రోడ్డు ఎస్సీ కాలనీలో నివాసముంటున్న బాధితుడు కొల్లి చంటిని శుక్రవారం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ పరామర్శించారు. అలాగే ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌లు కూడా పరామర్శించారు. మండపేట సత్యశ్రీ థియేటర్ వద్ద బైక్ పడిపోవడానికి సంబంధించిన వివరాలు వారు బాధితులను అడిగి తెలుసుకున్నారు. జరిగిన పరిణామాలను హర్షకుమార్‌తో పాటు నాయకులు తీవ్రంగా ఖండించారు. 76 ఏళ్ల స్వతంత్ర్య భారత దేశంలో ఇంకా అటువంటి రాజ్యమేలుతోందన్నారు. అగ్రవర్ణాల చేతిలో దళితులు ఇంకా బాధించబడడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. బాధితులు అన్ని విధాలా అండగా ఉంటామని వారు ధైర్యం చెప్పారు.

ఎమ్మెల్సీ తోట పరామర్శ

అగ్ర వర్ణాల యువకుల దాడిలో గురువారం గాయపడిన ఏడిద గ్రామానికి చెందిన దళిత యువకులను శుక్రవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ ఉన్నారు. పార్టీ నాయకులు బోడే సత్యకృష్ణ, ముమ్మిడివరపు బాబీరాజు, యరమాటి వెంకన్నబాబు పాల్గొన్నారు. వివాదానికి గల కారణాలను త్రిమూర్తులు బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఏదేద తీసుకెళ్లి అన్యాయంగా కొట్టడం తప్పు అని ఆయన ఖండించారు. బాధితులకు ఏ అవసరం వచ్చినా తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్సీ తోట భరోసా ఇచ్చారు.



కొల్లి చంటిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ హర్షకుమార్



దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేస్తున్న పలు సంఘాల నేతలు

దోషులను కఠినంగా శిక్షించాలి

కేసులో నిందితులను తప్పించాలని చూస్తే ఊరుకోం అగ్రవర్ణాల వారి చేతిలో బాధించబడిన దళిత యువకులకు సరైన న్యాయం చేయాలని ఎంఎల్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూలి జయరాజు, కార్మిక సంఘాల నాయకుడు దీకట్ల వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర కోస్తా జిల్లా ఇన్‌చార్జ్ ముమ్మిడివరపు దిన సుబ్బారావు, మాల మహానాడు నాయకుడు పెంటపల్లి జార్జ్‌మార్క్, దళిత సంఘాల నాయకుడు ఆకుమర్తి చిన్న మాదిగ, రెల్లి సంఘం రాష్ట్ర నాయకుడు బొత్సా నరసింహమూర్తి, నీలాపు వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఏడిదలో వారిలోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఇద్దరిని ఏడిద గ్రామంలోని గుడిలో నిర్బంధించడం, సుమారు పంద మందిని పైగా కొట్టడం అత్యంత దారుణమైన ఘటనగా వారు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు మండపేటలో పోటుచేసుకోవడం అమానవీయమన్నారు. ఈ కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండు చేశారు. కొందరు నిందితులను కేసు నుంచి తప్పించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఒకవేళ అలాంటి పరిణామం ఎదురైతే దళిత సంఘాలు, కార్మిక సంఘాల ఐక్యతతో న్యాయ పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె. కృష్ణవేణి, దళిత నాయకులు పాల్గొన్నారు.

దళితులపై దాడి అమానుషం

కపిలేశ్వరపురం: మండపేట మండలం ఏడిదలో దళితులను గుడిలో బంధించి దాడి చేయడం అత్యంత అమానుషమని వైఎస్సార్ సీపీ, దళిత సంఘం జిల్లా నాయకుడు మల్లిపూడి శివకుమార్ ఖండించారు. ఆధునిక కాలంలో సైతం దళితులపై దాడులు జరగడం సామాజిక హింస కొనసాగుతుందనడానికి నిదర్శనమన్నారు. దాడికి పాల్పడిన అగ్రకుల వర్గాల వారిని దక్ష పరిధిలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మంత్రి సుభాష్‌ను కలసిన ఆర్డీవో అఖిల



మంత్రి సుభాష్‌ను కలసిన ఆర్డీవో అఖిల

రామచంద్రపురం: ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన దేవరకొండ అఖిల శుక్రవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి సుభాష్‌కు పూలమొక్కను ఆర్డీవో అఖిల అందజేశారు. అనంతరం రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు.

ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడిగా బోనం శ్రీను



కమిటీ అధ్యక్ష, కోశాధికారులు బోనం శ్రీను, చక్కా రాజులను అభినందిస్తున్న కమిటీ సభ్యులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో ప్రసిద్ధి చెందిన ప్రసన్నాంజనేయ స్వామి బాలభక్త సమాజం అధ్యక్షుడిగా మండలంలోని వెంకటాయపాలెంకు చెందిన బోనం శ్రీనివాసరావును ఆ కమిటీ సభ్యులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ఏటా కార్తిక మాసంలో ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద కార్తిక సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. కమిటీ కోశాధికారిగా హసన్‌బాదకు చెందిన చక్కా రాజును ఎంపిక చేశారు. ఈ కమిటీకి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గౌరవాధ్యక్షుడిగా ఉన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'చి'వరి'లో చిక్కులు

- తొలి నుంచి కష్టాల సాగే..
- గింజ గట్టిపడే దశలో పంటపై దోమపోటు
- ఉధృతిని బట్టి మందులు పిచికారీ చేయాలంటున్న వ్యవసాయాధికారులు

కాజులూరు: ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులకు అన్ని విధాలుగా కష్టాలే ఎదురవుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సాగు తొలి దశ నుంచి పంటలపై తెగుళ్లు రైతన్నలను ఇబ్బందులు పెడుతుండగా ప్రస్తుతం పంట చివరి దశలోనూ వరిపై సుడిదోమ ఆశించి రైతులను కలవరపెడుతుంది.

ఉధృతంగా ఆశిస్తున్న సుడిదోమ

నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో సుమారు 52 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం అధిక శాతం పంట గింజ గట్టిపడే దశలో ఉండగా పలు చోట్ల కోత దశకు చేరువలో ఉంది. నియోజకవర్గంలో పంట గింజ గట్టిపడే దశలో ఉన్న పొలాల్లో పంటపై అక్కడక్కడా మాగుడు తెగులు ఆశించగా అధికశాతం పొలాల్లో సుడిదోమ ఆశించినట్టు రైతులు చెబుతున్నారు. కొన్నిచోట్ల పచ్చదోమ ఆశిస్తుండగా ఎక్కువగా పొలాల్లో తెల్లదోమ, గోధుమవర్ణం దోమలు వరి మొక్కలను ఆశిస్తున్నాయి. తెల్లదోమ, గోధుమ రంగు దోమలు మొక్కమొదలు భాగాన్ని ఆశించి పిండిపదార్థాలను పీల్చివేసి కీలకద్రాలను వ్యాప్తి చేస్తాయి. ఈ కీలం దీరం వల్ల మొక్క ఖనిపోతుంది. అయితే పంట చివరి దశలో ఉండి కోతకు ఆని రైతులు ఆశ్రద్ధ చేస్తే దోమ ఆశించిన స్థలంలో పంట సుడులు సుడులుగా కాలిపోయిన మాదిరిగా తయారై తీవ్ర నష్టం కలుగుతుంది. పంటను రక్షించుకోవాలని ఆత్రుతతో అవసరానికి మించి ఎరువులు ఉపయోగించటం అధిక వ్యయాలకు గురి చేస్తుందని రైతులు ఆలోచించి మందును పిచికారీ చేసే ముందు



కాజులూరులో దోమపోటుకు గురైన వరి పైరు

దోమ ఉధృతిని గమనించి దానికి అనుగుణంగా మందులు పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ తెలిపారు.

ఏ దశలో ఏ మందు వాడాలంటే..

వరి దుబ్బు మొదలులో 20 నుంచి 25 దోమలు ఉన్నట్టు గమనించినట్లయితే బుప్రొఫెజిన్ (అప్లాండ్) 1.6 మిల్లీ లీటర్లు లేదా ఇమిడోక్లోప్రిడ్, ఇథిప్రోల్ (గ్లామర్), 0.25 మిల్లీలీటర్లు, లేదా డైనోటిఫూరాన్ (ఓషిన్/టోకెన్) 0.4 గ్రాములు, పైమెట్రోజిన్ (చెస్) 0.6 గ్రాముల లీటరు నీటిలో కలిపి 200 లీటర్ల మందు ద్రావణాన్ని ఎకరం పంటపై వారానికి రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. అదే విధంగా వరి దుబ్బు మొదలులో 100 నుంచి 200 దోమలు ఉన్నట్టు గమనించినట్లయితే ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఇథోఫెన్‌ప్రాక్స్ (నుక్రాన్) 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి 200 లీటర్ల మందు ద్రావణాన్ని వారానికి రెండు సార్లు ఎకరం పంటపై పిచికారీ చేయాలన్నారు. వరి దుబ్బుకు 200 పైబడి దోమలు ఉన్నట్టు గమనిస్తే పెక్సాలుఫ్లోర్ (దీవిన్) 2 మిల్లీ లీటర్లు, లేదా మోనోక్రోటోఫాస్ రెండు మిల్లీ లీటర్లు లేదా డైనోటోఫ్యూరాన్ (నువాన్) ఒక మిల్లీలీటరు లీటర్ నీటికి కలిపి రెండు వందల లీటర్ల మందు ద్రావణాన్ని ఎకరం పంటపై పిచికారీ చేయాలన్నారు.

దోమపోటు ఆశిస్తే పంట నాశనం

వరి పంటపై దోమపోటు ఆశిస్తే పంట నాశనమవుతుంది. దోమ ఆశించిన చోట పంట సుడులుసుడులుగా ఎండిపోయి కాలిపోయినట్టుగా తయారౌతుంది. ఆ ప్రాంతంలో పంట కోత కోసినా దిగుబడి రావడం లేదు.



– నరాల నాగేశ్వరరావు, రైతు, దుగ్గుదూరు

ఆయన నేత్రాలు సజీవం



పడాల శ్రీనివాసరెడ్డి (ఎండీ శ్రీను) (ఫైల్)

రాయవరం: ఆకస్మికంగా మృతి చెందిన వైఎస్సార్ సీపీ నేత పడాల శ్రీనివాసరెడ్డి (ఎండీ శ్రీను) (57) కళ్లను కుటుంబ సభ్యులు దానం చేశారు. మాచవరానికి చెందిన శ్రీనివాసరెడ్డి గుండె పోటుతో మృతి చెందగా కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ఐ బ్యాంక్ సిబ్బంది వచ్చి నేత్రాలను సేకరించారు. శ్రీనివాసరెడ్డి కుమారుడు వసంతకుమార్‌రెడ్డి పంచాయతీ ఉప సర్పంచ్.

ప్రముఖుల పరామర్శ

పిత్తు వియోగంతో బాధపడుతున్న పడాల వసంతకుమార్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ యువ నేత తోట పృథ్వీరాజ్ శుక్రవారం పరామర్శించారు. వసంతకుమార్‌రెడ్డిని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ కర్నీడు సీతామహాలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథ్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, కొవ్వూరు రెడ్డి సంఘం అధ్యక్షుడు కొవ్వూరి త్రినాథరెడ్డి తదితరులు పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.